క్లుప్తంగా

నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలు

అల్లవరం: మండలంలోని 23 సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, స్పోర్ట్స్ వలంటీర్ల ఆధ్వర్యంలో మంగళవారం నుంచి నిర్వహించనున్నామని ఎంపీడీఓ కృష్ణమోహన్ సోమవారం తెలిపారు. ఓడలరేవు, కొమరగిరిపట్నం, గోడిలంక, దేవగుప్తం, కోడూరుపాడు, పేరూరు, మొగళ్ళమూరు, అల్లవరం గ్రామాల్లోని పాఠశాలల్లో వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో, క్రికెట్ క్రీడల్లో జనవరి 6 వరకూ పోటీలు జరుగుతాయని చెప్పారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


ఉప్పలగుప్తంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ చిన్నవరాజు

ఉప్పలగుప్తం: స్థానిక గ్రామ పంచాయితీ పరిధి గోడివారిపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీ ప్రకారం రూ.5 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో అధ్వానంగా ఉన్న రోడ్లను గుర్తించి అతిత్వరలో అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గోడి ఆదిలక్ష్మి, రైతు విభాగం మండల అధ్యక్షుడు చిక్కం బాలసుబ్రహ్మణ్యం, మోటూరి సత్యం కాపు, నడింపల్లి సుబ్బరాజు, కఠారి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ


విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న సుబ్రహ్మణ్యస్వామి

అమలాపురం రూరల్: కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బండారులంకలో ఇంజినీరింగ్, డిప్లొమా చదువుతున్న విద్యార్థులకు మాజీ ఎంపీపీ వూటుకూరి సుబ్రహ్మణ్య స్వామి ఉపకార వేతనాలు సోమవారం పంపిణీ చేశారు. కోనసీమలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 200 మంది దేవాంగ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున అందజేశారు. దేవాంగ సంఘం తరఫున విద్యార్థులకు ప్రోత్సాహకంగా ఇస్తున్న రూ.2 వేలను భవిష్యత్‌లో రూ.5 వేలు చేసేందుకు కృషి చేస్తామని సుబ్రహ్మణ్యస్వామి తెలిపారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు చింతా శంకరమూర్తి, కార్టూనిస్ట్ ఎం.రాము, చింతా వీరభద్రేశ్వరరావు, పిచ్చిక శ్యామ్, ఉప్పుగంటి నాగమల్లేశ్వరరావు, బళ్ల వెంకటేశ్వరరావు, పిచ్చిక పోలిశెట్టి, కారుపర్తి సాయి, దైవపు నందయ్య, ములికి విఘ్నేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఐ.పోలవరం: ఐ.పోలవరం ఎదుర్లంక వారధి వద్ద గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మృతుడి వయసు 30 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుంది. పసుపు రంగు టీషర్ట్, నీలిరంగు జీన్ ప్యాంట్ వేసుకుని ఉన్నాడు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ముమ్మిడివరం: తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ విద్యా శాఖ సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులు సోమవారం స్థానిక ఎయిమ్స్ కళాశాల వద్ద నిరసన సమ్మె చేట్టారు. దీక్షా శిబిరాన్ని ఎస్టీయూ, యూటీఎఫ్ సంఘాల నాయకులు సందర్శించి సంఘీబావం తెలిపారు.

వ్యాఘ్రేశ్వరునికి లక్ష బిల్వార్చన


స్వామికి సమర్పించిన టేకు తలుపులు

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో వేంచేసిన వ్యాఘ్రేశ్వర స్వామికి సోమవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు.

టేకు ద్వారాల సమర్పణ

పుల్లేటికుర్రులో వేంచేసిన బాలాత్రిపురసుందరి సమేత వ్యాఘ్రేశ్వరస్వామి ఆలయంలో ఉన్న స్వామి అంతరాలయం వద్ద టేకు ద్వారాలను పిల్లాడి శ్రీనివాసు సోమవారం సమర్పించారు. రూ.లక్ష విలువ చేసే టేకు అంతరాలయం ద్వారాలు, తలుపులు అందజేశారు. అంతకు ముందు టేకు తలుపులకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి అనుగ్రహంతో తన కుమారుడికి ఉద్యోగం వచ్చినందుకుగాను స్వామికి టేకు తలుపులు పంపిణీ చేయించినట్లు భక్తుడు శ్రీనివాస్ తెలిపారు.


అమలాపురం మన్నా జూబ్లీ చర్చ్‌లో వస్త్రదానం చేస్తున్న మత పెద్దలు


ముమ్మిడివరం సెయింట్‌పాల్ లూథరన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు


గోడితిప్ప క్రీస్తు దేవాలయంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


ఉప్పలగుప్తం ఆర్‌సీఎం చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ జయరాజు

క్రీస్తు జననం.. లోక రక్షణకు మార్గం

- ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, సామూహిక గీతాలాపనలు

అమలాపురం టౌన్: క్రీస్తు జననం లోక రక్షణకు మార్గంగా నిలిచిందని జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు, స్థానిక మన్నా విద్యాసంస్థల అధినేత కార్ల్ డేవిడ్ కొమానపల్లి(లాల్) అన్నారు. స్థానిక మన్నా జూబ్లీ చర్చ్‌లో క్రిస్మస్ సంబరాలను ఆయన సోమవారం ఉదయం ప్రారంభించి క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. అమలాపురంలోని మన్నా జూబ్లీ చర్చ్, సెయింట్ జాన్స్ లూథరన్ చర్చ్, జీడీఎం చర్చ్, అమలోద్భవి మాత ఆలయం తదితర చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. భారీ సెట్టింగ్‌లు, మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణ నడుమ క్రిస్మస్ వేదికపై ప్రదర్శనలు చేశారు. అనంతరం లాల్, ఎర్నెస్ట్ తాతపూడి, పాస్టర్ ఎస్టేర్ తాతపూడి ఆధ్వర్యంలో చర్చ్‌లో 650 మంది పేదలకు వస్త్రదానం చేశారు. స్థానిక మెయిన్ రోడ్డులోని సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో పాస్టర్ ప్రకాశ్ అంబేడ్కర్ క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు.

క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురంలోని రాష్ట్ర వైఎస్సార్ సీపీ మహిళా విభాగం కార్యదర్శి దేవరపల్లి గీత స్వగృహంలో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పాల్గొన్నారు. ఇటీవల పార్టీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా నియమితులైన గీతను ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ జేఏసీ రాష్ట్ర చైర్మన్ వీఎస్ దివాకర్, ఐఎంఏ కోనసీమ శాఖ అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ఎస్ఎన్‌మూర్తి, డాక్టర్ శారద దంపతులు పాల్గొన్నారు.


క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి గీతను అభినందిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు


తాళ్లరేవు బాప్టిస్టు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్


పెంకేవారిపేటలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న చిన్నారులు


అమలాపురంలో క్రీస్తు జననంపై నాటికను ప్రదర్శిస్తున్న యువతీ యువకులు

ఐ.పోలవరం: క్రైస్తవులంతా క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా మండలంలో జరుపుకొన్నారు. చర్చిల్లో ఆధ్యాత్మిక వాతావరణం చోటు చేసుకుంది. మండలంలోని కొమరగిరి, టి.కొత్తపల్లి, కేశనకుర్రు తదితర గ్రామాల్లో ఉన్న పెద్ద చర్చిల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. చర్చిలలో కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేడుకల్లో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్ రాజులు మండలంలోని పలు చర్చిల్లో జరిగే క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

ముమ్మిడివరం: స్థానిక సెయింట్ ఫాల్ లూథరన్ చర్చిలో పాస్టర్ ఎన్.సునీల్, పెంతెకోస్తు ప్రార్థనా మందిరంలో శామ్యూల్, వరల్డ్ పీస్ ఈవేంజికల్ చర్చిలో పాస్టర్ ప్రభుదానం, కత్రివేల్ ప్రార్థనా మంధిరంలో పాస్టర్ క్రిస్టోపర్, ఇంజియాన్ పెంతెకోస్తు చర్చిలో పాస్టర్ జ్యోతిబాబు, రమా బ్లెసింగ్ చర్చిలో ఫిలిప్స్, జీడీఎం చర్చిలో పాస్టర్ విలియమ్స్, మున్నా చర్చిలో పాస్టర్ జయధనంలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసు క్రీస్తు ప్రబోధం ఆచరణీయమని పాస్టర్లు తమ సందేశంలో పేర్కొన్నారు.

అల్లవరం: మండలంలోని ప్రధాన చర్చిల్లో క్రిస్మస్ సంబరాలు అంబరాన్ని అంటాయి. క్రిస్మస్ పండగను పురస్కరించుకుని క్రీస్తు దేవాలయాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించారు. గోడితిప్పలో దైవజ్ఞనులు వై.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. క్రీస్తు ఆరాధన అనంతరం నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేసి, క్రీస్తు క్యాలెండర్‌ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడ్‌సీడ్ ఫౌండేషన్ అధినేత కుంచే రమణారావు, సర్పంచ్ శ్రీదేవి, విజయ ఆస్పత్రి డాక్టర్ రతన్‌బెనర్జీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఉప్పలగుప్తం: మండలంలోని పలు క్రీస్తు మందిరాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉప్పలగుప్తం గ్రామం పెద్దూరులో ఉన్న ఆర్‌సీఎం చర్చిలో పాస్టర్ పినిపే జయరాజు ఆధ్వర్యంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు జరిగాయి. సంఘ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో ఓరిగిల జగపతి, ఉందుర్తి అంజలరావు, తొత్తరమూడి జ్యోత్స్న, జొన్నాడ ఆదియ్య, తవిటక చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: క్రిస్మస్ సందర్భంగా స్థానిక బాప్టిస్టు చర్చిలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమానికి ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ హాజరై ప్రార్థనలు చేశారు. స్థానిక పెంకేవారిపేటలోని న్యూలైఫ్ బేతెస్త మందిరంలో పాస్టర్ అభిషేక్ రూబెన్, రూతమ్మ ఆధ్వర్యంలో చిన్నారులచే క్రిస్మస్ కేక్ కట్ చేయించి అందరికీ పంచారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

యానాం: పట్టణంలో క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. స్థానిక రోమన్ కేథలిక్ చర్చిలో సోమవారం తెల్లవారుజాము వరకు క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు బోధనలను పాటించడం ద్వారానే నిజమైన క్రిస్మస్ అవుతుందని పాదర్ మరియదాసు పేర్కొన్నారు. పలువురు చిన్నారులు శాంతాక్లాజ్ వేషధారణలతో సందడి చేశారు.

నూతన ఎస్‌ఐలకు డీఎస్పీ సత్కారం


చల్లపల్లిలో రమేష్, శ్రీలతలను అభినందిస్తున్న డీఎస్పీ అంబికాప్రసాద్ తదితరులు

ఉప్పలగుప్తం: మండలంలోని ఇటీవల ఎస్‌ఐలుగా నియమితులైన ఎస్.కొత్తపల్లి గ్రామానికి చెందిన కుంచే శ్రీలత, గోపవరం గ్రామానికి చెందిన తాళ్ల రమేష్‌లను అమలాపురం డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ ఘనంగా సత్కరించారు. మండలంలోని చల్లపల్లిలో సర్పంచ్ ఇసుకపట్ల జయమణి ఆధ్వర్యంలో సోమవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి డీఎస్పీ అంబికా ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదలతో చదివి పోలీసు ఉద్యోగాన్ని ఎంచుకుని ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. ప్రజలకు సేవలందించేందుకు విధుల్లో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉప్పలగుప్తం ఎస్‌ఐ జి.వెంకటేశ్వరరావు, సర్పంచ్ కుంచే బుల్లియ్య, డీబీ లోక్, ఇసుకపట్ల రఘుబాబు, కుంచే చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా ఎంపికైన యువకుడికి సత్కారం


ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపికైన రాజు, అతడి తల్లి ధనలక్ష్మిలను సత్కరిస్తున్న గాడిమొగ గ్రామస్తులు

తాళ్లరేవు: ఇటీవల విడుదలైన ఫలితాల్లో సివిల్ ఎస్‌ఐగా ఎంపికైన గాడిమొగ గ్రామానికి చెందిన కాలాడి రాజును గ్రామస్తులు సోమవారం ఘనంగా సత్కరించారు. స్థానిక వీరభద్రుని ఆలయం వద్ద గ్రామపెద్దలు, యువకుల ఆధ్వర్యంలో రాజు, అతడి తల్లి ధనలక్ష్మిలను దుశ్శాలువాలు, పూలమాలలతో అభినందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తన తండ్రి బీరాస్వామి ఎంతో కష్టపడి తనను చదివించారని, 2015లో ఆయన ఆకస్మిక మృతితో ఎన్నో ఇబ్బందులు పడ్డామన్నారు. తన తల్లి ధనలక్ష్మి, తమ్ముడు వీరబాబు అందించిన ప్రోత్సాహంతో కష్టపడి ఈ ఉద్యోగం సాధించినట్లు తెలిపాడు. తన కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు గ్రామం అందించిన సహకారాన్ని మరువలేనన్నాడు. ఈ సందర్భంగా రాజును అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం నాయకుడు వైదాడి నూకరాజు, కామాడి మాతరాజు, మల్లాడి సీతారామరాజు, కర్రి బాబి, ధర్మారావు, మాతరాజు అభినందించారు.

జాతీయ భావనకు మనుస్మృతి విఘాతం


పేరూరులో మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న మాలమహానాడు నాయకులు

అమలాపురం రూరల్: భారతదేశంలో జాతీయ భావనకు మనుస్మృతి ఆది నుంచి అడ్డంకిగా నిలిచిందని మాల మహానాడు నాయకుడు జల్లి శ్రీనివాసరావు అన్నారు. పేరూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమానత్వం వర్ధిల్లాలని, ప్రతి మనిషికీ ఒకే విలువ గల సమాజం నిర్మించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు ఎంవీవీ సత్యనారాయణ, ముత్తాబత్తుల సత్యనారాయణ, ఆనందరావు, జల్లి శేఖర్, ఎం.శ్రీనివాస్, తాడి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో విప్పర్తి శ్రీనివాస్, విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, టేకుమూడి ఈశ్వరరావు, కమిడి ఈశ్వరీబాయి తదితరులు పాల్గొన్నారు.

అక్కడ సంక్రాంతికి సెలవులు లేవు

యానాంలో విచిత్ర పరిస్థితి

యానాం: కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో భాగాలైన యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరిల్లో భాషలు వేర్వేరు కావడంతో సంస్కృతులు సైతం భిన్నం. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రాధాన్యత ఉన్న పండగలు సైతం వేర్వేరుగా ఉంటుండడంతో పాఠశాలలకు సెలవులు ప్రకటించడంలో పుదుచ్చేరి విద్యాశాఖలో గందరగోళం ఏర్పడుతుంది. పుదుచ్చేరిలో రెండో టర్మ్ హాలీడేస్‌గా ఈ నెల 26, 27, 28 తేదీలను ప్రకటించారు. అదే విధంగా కారైకల్‌లో శనీశ్వరస్వామి ఉత్సవాలకు సెలవులు మార్చుకుని వారు తీసుకున్నారు. మాహేలో సైతం అక్కడ మళయాళీ సంస్కృతికి సంబంధించి ఓనమ్ పండగకు సైతం ప్రాధాన్యత పండగగా సెలవులు ఇస్తున్నారు. అయితే భౌగోళికంగా ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న తెలుగు ప్రాంతమైన యానాంలో సంక్రాంతి పండగకు విద్యాశాఖ సెలవులు ప్రకటించకపోవడంతో స్థానిక విద్యార్థులు, టీచర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో హాలిడేస్‌లో తాము పనిచేస్తామని, దానికి బదులుగా వచ్చే నెల 16, 17, 18 తేదీల్లో సెలవులు ప్రకటించాలని స్థానిక టీచర్ అసోసియేషన్ సభ్యులు డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పుదుచ్చేరికి విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రాంతీయ విద్యాశాఖాధికారి లక్ష్మణ్‌ప్రవీణ్‌ను వివరణ కోరగా టెర్మ్ హాలిడేస్‌తో పాటు సంక్రాంతి సెలవులు ఇచ్చేలా పుదుచ్చేరి విద్యాశాఖ డైరెక్టరేట్‌కు పంపినట్లు తెలిపారు. త్వరలో సర్క్యులర్ వస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందాలన్నదే లక్ష్యం

కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి మురుగన్


ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి మురుగన్ తదితరులు

యానాం: పేదలకు సంక్షేమ పథకాలు అందాలన్నదే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి ఎల్.మురుగన్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌టీపీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అధ్యక్షతన నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశాభివృద్ధికి ప్రధాని నరేంద్రమోడీ గ్యారంటీగా ఉన్నారన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందాలన్న ధ్యేయంతోనే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టామన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా కిసాన్ సమ్మాన్ యోజన, ఉచిత గ్యాస్ పంపిణీ, ఆయుష్మాన్ భారత్, జలజీవన్‌మిషన్ తదితర పథకాలు అందిస్తున్నామని చెప్పారు. 2041 నాటికి పేదలు లేని దేశంగా మారాలన్న సంకల్పంతో ప్రధాని మోడీ నిరంతరం శ్రమిస్తున్నారు. పుదుచ్చేరి శాసనసభ స్పీకర్ ఆర్.సెల్వం మాట్లాడుతూ యానాం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి, యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, బీజేపీ అధ్యక్షుడు కనకాల రాజు, పుదుచ్చేరి కలెక్టర్ వల్లవన్, ఆర్‌ఏఓ మునిస్వామి, డీడీ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సుడిగాలి పర్యటన

యానాం విచ్చేసిన కేంద్ర సమాచార, ప్రసార, మత్స్య, పశుసంవర్ధక మంత్రి ఎల్.మురుగన్ సోమవారం మధ్యాహ్నం సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌నగర్‌లో రూ.12.82 కోట్లతో చేపట్టిన ఆయుష్ ఆసుపత్రిని ఆయన పరిశీలించారు. అనంతరం రూ.53 కోట్లతో నిర్మించిన జిప్‌మెర్ ఆసుపత్రిని పరిశీలించి రోగులకు అందుతున్న సేవల గురించి సమీక్షించారు.

108లో ప్రసవం

మామిడికుదురు: పెదపట్నం గ్రామానికి చెందిన హైమావతి అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో సోమవారం 108కి సమాచారం అందించారు. 108 సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. హైమావతికి నొప్పులు తీవ్రం కావడంతో 108లోనే డెలివరీ చేశారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని మెరుగైన వైద్యం కోసం వారిని రాజోలు ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లామని ఎమర్జెన్సీ టెక్నీషియన్ సత్తెంశెట్టి రాము తెలిపారు. స్థానికులు 108 సిబ్బంది రాముతో పాటు పైలట్ నాగరాజును అభినందించారు.

ప్రభల ఉత్సవాన్ని విజయవంతం చేద్దాం

అంబాజీపేట: ఏటా కనుమ రోజున మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో నిర్వహించే ప్రభల ఉత్సవాన్ని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అందరం కలసికట్టుగా విజయవంతం చేద్దామని సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఏఓ బి.వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు అన్నారు. మొసలపల్లిలో వేంచేసిన భోగేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో 11 గ్రామాలకు చెందిన ప్రభల ఉత్సవ నిర్వాహకులు, గ్రామ పెద్దలు సోమవారం సమావేశమయ్యారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రభల తీర్థానికి సంబంధించి 11 గ్రామాలకు చెందిన నిర్వాహకులతో కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. తీర్థంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా ప్రభల కమిటీ నిర్వాహకులు చర్యలు తీసుకుని భక్తులకు సహకరించాలన్నారు. తీర్థంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు సూచించారు. సమావేశంలో దంతులూరి శ్రీనివాసరాజు, సూర్యారావు, సతీష్‌రాజు, మోహనరాజు, కృష్ణంరాజు, శ్రీపాద వెంకటరమణ, అర్చకులు పాల్గొన్నారు.

అయోధ్య రామ శోభాయాత్ర

పి.గన్నవరం: అయోధ్య రామ శోభాయాత్ర కార్యక్రమం సోమవారం పి.గన్నవరంలో ఘనంగా నిర్వహించారు. అయోధ్య నుంచి తీసుకు వచ్చిన బలరాముని స్వర్ణ అక్షితలను గ్రామంలో ఊరేగించారు. అయోధ్యరామ అక్షతలు, ఆహ్వాన పత్రాలు, శ్రీరాముని ఫొటోలను వచ్చే నెల 1 నుంచి ఇంటింటికీ పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో విశ్వ హిందూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్రహ్మణ్యం, భమిడిపాటి కృష్ణమూర్తి, వి.రాంబాబు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అందజేత


కేంద్రమంత్రి మురుగన్‌కు జ్ఞాపికను అందజేసిన ఎమ్మెల్యే అశోక్ దంపతులు

యానాం: సోమవారం స్థానిక ఎస్‌టీపీపీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మత్స్యశాఖ ద్వారా 50 శాతం రాయితీపై ఆక్వా రైతులకు ఇచ్చే రూ.13 లక్షల విలువైన బొలొరో వాహనం తాళాలను లబ్ధిదారుడు మెల్లం శ్రీనివాసరావుకు కేంద్రమంత్రి ఎల్.మురుగన్ అందజేశారు. మోటార్ సైకిల్‌తో కూడిన ఐస్‌బ్యాక్స్‌ను లబ్ధిదారుడు గోవింద్‌కు, కిసాన్ క్రెడిట్ కార్డులను ఆయా లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ద్వారా టీబీ వ్యాధిగ్రస్తులకు సమకూర్చిన నిత్యావసర కిట్లను రోగులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి, స్పీకర్ ఆర్.సెల్వం, కలెక్టర్ వల్లవన్, ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు. కేంద్రమంత్రి మురుగన్‌కు ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్, స్నేహ దంపతులు జ్ఞాపికను అందజేశారు.

బ్రాహ్మణులు సంఘటితం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న బ్రాహ్మణ సంక్షేమ వేదిక వ్యవస్థాపక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం

అమలాపురం టౌన్: బ్రాహ్మణులు చైతన్యవంతులై సంఘటితం కావాలని ఉభయ తెలుగు రాష్ట్రాల బ్రాహ్మణ సంక్షేమ వేదిక వ్యవస్థాపక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక ఏఎస్ఎన్ కళాశాలలో సోమవారం జరిగిన వేదిక జిల్లా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన వేదిక సమావేశం బ్రాహ్మణుల చైతన్యం, యువత విద్య, సేవ, రాజకీయ ఉనికి, సనాతన ధర్మ పరిరక్షణ అనే అంశాలపై చర్చించింది. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణిస్తూ రాజకీయ రంగంలోనూ తమదైన ముద్ర వేయాలని ఆకాంక్షించారు. దేశానికి ఎన్నో ఆర్థిక సంస్కరణలు చేసిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. బ్రాహ్మణ సంక్షేమ వేదిక కృషిని అభినందిస్తూ అమలాపురానికి చెందిన సీనియర్ న్యాయవాది రూ.5 వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో వేదిక జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జీఎంఎస్ఎస్ శాస్త్రి, ఏఎస్ఎన్ కళాశాల పాలకవర్గ కోశాధికారి ఏడిది కామేశ్వర నళినీకుమార్, ఏడిది సుబ్రహ్మణ్యశర్మ, ఎం.వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి


వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దొరబాబు తదితరులు

అమలాపురం రూరల్: భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల రామ్మోహన్‌రావు అధ్యక్షతన సోమవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, పాలూరి సత్యానందం, జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్, బీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.